# కారణం

చంద్రశేఖరం గారి యిల్లు మహా సందడిగా వుంది. కొడుకులూ కోడళ్ళూ, కూతుళ్లూ అల్లుళ్లూ, మనుమలూ మనుమరాళ్లూ, బంధువులు స్నేహితులూ, పరిచయస్తులు - అందరూ అక్కడికి చేరుకున్నారు. ఎటు చూసినా సంబరం, సంతోషం! అందరూ చకచకా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు.

విషయం తెలుసుకున్న పార్లమెంటు సభ్యులు, మంత్రిగారు, ఆ వూరి మున్సిపల్ ఛైర్మన్‌గారు "ఇటువంటి చరిత్రాత్మకమైన సంఘటనలు మళ్ళీ మళ్ళీ పదిసార్లు రావు. నూటికో కోటికో ఒక్కసారి అవకాశం వస్తుంది. అటువంటి అవకాశం మనం వదులుకోకూడదు. అంతకంటే తెలివితక్కువ పని యింకొకటి వుండదు. ఇది మన అందరికీ సంబంధించిన శుభకార్యం. ఊళ్ళో అందరికీ పెద్ద దిక్కు అయిన ఆయన ఆశీస్సులు మా అందరికీ కావాలి. ఈ వేడుక మన పురమందిరంలో జరగాలి. మేమంతా పాల్గొంటాము" అని కోరుకున్నారు.

పెద్దలు మాటలు గౌరవించే సాంప్రదాయం యీ వూర్లో అనాదిగా వస్తోంది. ఈనాడూ అంతే! పెద్దల కోరికని **పిన్నలు** గౌరవించాలి.

ఆరోజు సాయంకాలం ఊరంతా వెంటరాగా సకుటుంబ సపరివారంగా చంద్రశేఖరంగారు, వారి సతీమణి పార్వతమ్మగారు టౌనుహాలు చేరుకున్నారు. చంద్రశేఖరంగారు యీనాటికీ సదాశివులే! చూస్తే దిష్టి కొట్టేంత అందగాడే! వారి యిల్లాలు సుగుణ వినయశీల. ఆచారాలూ, సాంప్రదాయాలు బాగా తెలిసిన వ్యక్తి పతిదేవుడు. పాలరాతి విగ్రహం, ఆజానుబాహుడు. తను మాత్రం దక్షిణాది ఆలయాలలో అమ్మవారి రంగు. నిగనిగలాడే చక్కటి నలుపు. చూపులకి చంద్రవదన కాదు కాని ఆవిడని అర్థం చేసుకున్న ఆత్మీయులకి ఆవిడ ప్రసన్న వదన. వారిద్దరిదీ ఏదో జన్మలో ముడిపడ్డ జన్మజన్మల బంధం. ఈ జన్మలో పెద్దలు నిర్ణయించిన సంబంధం! ఈనాటికీ మూడుపువ్వులూ ఆరుకాయలూ అన్నట్టుగా వున్న సంసారం.

చంద్రశేఖరం గారి తాతగారు పార్వతమ్మగారి తాతగారి సతీర్థులు. ఒకే గురుకులంలో విద్యాభ్యాసం చేసిన పండితులు. సన్నిహితులైన స్నేహితులు. గురువుగారి దగ్గర విద్యాభ్యాసం పూర్తిచేసుకుని యింటికి తిరిగి వచ్చే సమయంలో వారి మనస్సులలో మసలిన మాట-

'మనం స్నేహం బంధుత్వంగా మారాలి!'

ఈ స్నేహితులు యిద్దరికి పురుషసంతానమే కాని స్త్రీ సంతానం లేకపోవడం వలన- రెండవ తరంలో యీ కోరిక తీరలేదు.

మూడవ తరంలో - దైవం అనుకూలించాడు. పార్వతమ్మ బారసాలనాడే వీరి వివాహం నిశ్చయం అయింది.

చంద్రశేఖరం గారి ఉపనయనం, పార్వతమ్మగారి అక్షరాభ్యాసం ఒక్కసారే జరిగాయి.

'మేమంతా క్షేమంగా ఉండగానే మూడుముళ్ళూ పడా'లని పెద్దలు పట్టు పట్టడం- 'ఈ పెళ్ళి చూసి మేం పోతాం, త్వరగా చెయ్యండి' అని మూలనున్న ముసలమ్మలు శాసించడంతో- శారదా బిల్లు చట్టం గురించి మనస్సులో భయంగా ఉన్నా, పెద్దవాళ్ళను ఎదిరించలేక-

ఒక శుభముహూర్తాన యింకా నూనూగు మీసాలైనా రాని చంద్రం గారికి, పువ్వుల గౌన్లు, రెండు జడలు వదలి అప్పుడే పరికిణీ చొక్కాలు వేసుకోవటం మొదలుపెట్టిన పార్వతమ్మకి దైవసాక్షిగా, అగ్నిసాక్షిగా పెద్దల సమక్షంలో వైభవంగా ఐదు రోజుల పెళ్ళి జరిగింది.

ముహూర్త బలం, గురువుల అనుగ్రహంతో శుభకార్యం నిర్విఘ్నంగా జరగడమే కాదు- ఈ దంపతుల యిల్లు కాలక్రమేణా బంగారం అవడమే కాదు, ఆ యిల్లు పది యిళ్ళు అయింది. వాళ్ళ అన్యోన్య దాంపత్యం ఊరికి ఉపకారం అయింది. ఎవరి యింట శుభకార్యం జరిగినా వీరి ఆశీస్సులతో జరగవలసిందే! ఆ వాడలో వాళ్ళకి పెద్ద దిక్కే కాకుండా పెద్ద మనస్సు గల వ్యక్తులుగా పేరు తెచ్చుకున్నారు. ఆది దంపతులుగా అందరి మన్ననలు పొందారు. సంతోషంతో, సంతృప్తితో కాలం యుగాలు క్షణాలుగా గడిచి యీనాటికి యిక్కడికి వచ్చి ఆగింది.

ఇంత సంతోషంలోనూ, సంబరంలోనూ రెండు తరాలుగా అందరి మనస్సుని మథనం చేస్తున్న ప్రశ్న-

ఈ దంపతుల మధ్య మాటలు లేవు ఎందుకని?

కారణం తెలియదు. కారణం అడగటానికి ఎవ్వరికీ ధైర్యం చాలలేదు. చిలుకా గోరువంకల్లాగా అన్యోన్యంగా ఉండే యీ దంపతుల మధ్య మౌనం ఎందుకని? అర్థం కాని దూరం ఎందుకని?

అల్లా అని వాళ్ళు ఎడముఖం పెడముఖంగా ఉంటున్నారని కాదు. సాంప్రదాయ సంరక్షణలో కాని, ఆచార వ్యవహారాలలో కాని, అతిథి అభ్యాగతులను

ఆదరించడంలో గాని, శుభకార్యాలు చెయ్యడంలో గాని, లేనివారికి సహాయం చెయ్యడంలోకాని వారిద్దరిదీ ఒకటే మాట. కానీ వారిద్దరి మధ్య మాటలే ఎవరికీ వినబడటం లేదు.

వీరంతా టౌనుహాలుకి చేరుకునే సరికి, అక్కడ ఇసుక వేస్తే రాలనంత జనం వున్నారు. నాదస్వరంతో ఎదురు వచ్చారు. పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కైలాసమంత అందమైన వేదికమీద యీ దంపతులని కూర్చోపెట్టారు.

వేదపండితులు స్వస్తి పలికారు.

అమ్మవారి పటం ముందు అయిదు వత్తులు వేసిన జ్యోతి వెలిగించారు. సువాసినులంతా లలితా అష్టోత్తరం ముక్తకంఠంతో చదివారు.

అన్నింటికన్నా ఆశ్చర్యం... ధర్మప్రచారానికి ఆ నగరానికి విచ్చేసిన పీఠాధిపతులు యీ శుభకార్యానికి తమంతట తాము విచ్చేయటం 'జీవేన శరద శ్శతం' అని యీ దంపతులని ఆశీర్వదించటం, చూసిన నగరవాసులు పరవశులై వారికి జయజయనాదాలు చేస్తూ ప్రణమిల్లడం, శ్రీవారు వీరందరినీ నారాయణ స్మృతిగా ఆశీర్వదించటం అన్నీ క్షణాలలో శుభప్రదంగా జరిగాయి.

మున్సిపల్ ఛైర్మన్‌గారు యీ దంపతులకు నమస్కరించారు. మంత్రిగారిని, పార్లమెంటు సభ్యులను చిరునవ్వుగా పలకరించారు. ఈ దంపతులకు పాదాభి వందనం చేశారు. ప్రతిపక్షం వారి వంక విజయగర్వంతో చూశారు. వారి ఉపన్యాసం ప్రారంభమైంది.

"మనం చాలా అదృష్టవంతులం. ఇటువంటి అవకాశం మన నగరంలోనే కాదు, బహుశః ప్రపంచంలోనే ఎవ్వరికీ రాదు. ఇది మన ఊరి ప్రజలు చేసుకున్న అదృష్టం.

ఇటువంటి దంపతులు ఉన్న ఈ మహానగరానికి నేను ఛైర్మన్‌గా రావటం, అందులోనూ ఈ నగర చరిత్రలోనే కాదు, ఈ రాష్ట్ర చరిత్రలో కూడా ఎవ్వరూ ఊహించనంత అత్యధిక మెజారిటీతో నన్ను గెలిపించిన మీకు మరొక్కసారి కృతజ్ఞతా పూర్వక వందనాలు చేస్తున్నాను. మన నగరానికి ఎంతో గొప్ప చరిత్ర ఉంది. కాని ధనం లేదు. నీరు, మురుగు కాలవలు, రహదారులు, ఎలక్ట్రిసిటీ- యీ విషయాలలో మనం చాలా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాము. మన ఆర్థిక వనరులు పెంచుకుంటూనే గాని యీ సమస్యలని పరిష్కారం చేసుకోలేము. ఎన్నో త్యాగాలు చేసి మీరు ఈ దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టారు. త్యాగం చెయ్యడం మీ రక్తంలోనే వుంది. మీ వారసత్వంలోనే వుంది. మీ సంప్రదాయంలోనే వుంది. మీరు మరొక్కసారి త్యాగం చెయ్యవలసిందిగా పార్టీలకు, వర్గాలకు,

రాజకీయాలకు అతీతంగా వ్యవహరించవలసిందని కోరుకుంటున్నాను. ఉజ్జ్వల భవిష్యత్తు కోసం, బడ్జెట్ లోటు పూర్తి చెయ్యడం కోసం, మీరు పన్నులు, లోగడ బకాయిలు వెంటనే చెల్లించవలసిందిగా ప్రార్థిస్తూ సదవకాశం యిచ్చిన చంద్రశేఖరం గారికి, వారి సతీమణి శ్రీమతి గారికి నా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియపరుస్తు మీ అందరి తీసుకుంటున్నాను. వందేమాతరం."

ఆయన పార్టీ మనుష్యులంతా కొట్టిన చప్పట్లతో హాలు

గౌరవనీయులైన మంత్రివర్యుల ఉపన్యాసం ప్రారంభ

"ఇటువంటి సభలకు రావడం నాకు చాలా ఆనందంగా యీ నగరంలో, యీ గడ్డమీద పుట్టిన పేదబిడ్డను. రెండవ పూట వుంటుందో, వుండదో చెప్పలేని వెనుకబడిన జాతిలో పుట్టిన వాడిని. సుఖం ఎరుగని కులంలో పుట్టిన వాణ్ణి. ఇంట్లో వుండలేక బడికి నేను అంతవాడిని యీనాడు ఇంతవాడిని అయ్యానంటే అదంతా యీ కూర్చున్న మన అందరికీ అమ్మ పార్వతమ్మ గారి దయ. ఇంటి అన్నం తెచ్చుకోలేని నాడు ఆకలి భరించలేక పార్వతమ్మగారి ఇంటి కొళాయిలో నీళ్ళు తాగి కడుపు నింపుకొనే వాడిని. ఆ తల్లికి నా నాకు కడుపు నిండా అన్నం పెట్టి పంపించేది. నేను ఎప్పుడు కనిపించి రెండే ప్రశ్నలు వేసేది. "నాయనా అన్నం తిన్నావా? అన్నం ఈ కండలు ఆవిడ పెట్టిన అన్నంతో పెరిగినవే.

ఈ రాష్ట్రంలో తొలిసారిగా ప్రప్రథమంగా అసెంబ్లీ ఎన్నికల ఊహించలేని మెజారిటీతో గెలుపొందటమే కాదు, వెంటనే మంత్రిని జరిగిందంటే అదంతా ముఖ్యమంత్రిగారి చలువే కాదు, యీ అమ్మ కూడా!

ఈ శుభసందర్భాన నేను నా ప్రజలకు యిచ్చే హామీ ఒక్కటే వంచన లేకుండా నా ప్రజలకి సేవ చేస్తానని, వారి సమస్యలన్నీ పరమేశ్వరుల పాదాల సాక్షిగా పరిష్కారం చేస్తానని శపథం చేస్తూ మహదావకాశం యిచ్చి నన్ను గౌరవించినందుకు మీ అందరికీ తెలియపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను."

మంత్రిగారి యీ వాగ్దానం గురించి, ఆయన సమస్యలని పరిష్కారం చేస్తాడో అందరికీ తెలుసు కాబట్టి, జనం చిరునవ్వు నవ్వారు.

పార్లమెంటు సభ్యులు చాలా మితభాషి, కార్యశూరుడు.

"ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని, ఈ చరిత్రాత్మకమైన సమయంలో మూడు శాశ్వతమైన పథకాలు కేంద్ర ప్రభుత్వం సహాయంతో యీ వూళ్ళో చేయిస్తానని హామీ యిస్తున్నాను. మన ఊరి మార్కెట్ దగ్గరకు బస్సు స్టేషన్, రైల్వే స్టేషన్ తీసుకు వస్తానని, నేషనల్ హైవే యీ వూరు మీదుగా మళ్ళించేలాగా చేస్తానని శపథం చేస్తున్నాను. కేంద్ర ప్రభుత్వంతో చెప్పి మ్యాచింగ్ గ్రాంటు తెప్పించే బాధ్యత నాది. శెలవు" అంటూ యీ దంపతుల వంక చూచి నమస్కారం చేశారు. శ్రోతలు మ్యాచింగ్ గ్రాంటును గురించి ఆలోచిస్తూ చప్పట్లు కొట్టడం మరిచి పోయారు.

పిలిచినా పిలవకపోయినా అన్ని సభలకు తప్పనిసరిగా హాజరై వద్దన్నా వినకుండా తన కవితలతో ప్రజలను చిత్రవధ చేసే మహాకవిగారు యీ సభకు కూడా విచ్చేయడమే కాదు, యీ శుభసందర్భం కోసం ప్రత్యేకంగా వ్రాసిన కవిత 'హైకూ-నాని', 'అమ్మో! బాబో! ఆకలి' అనే కవితలు చదివి శ్రోతలందరినీ అలరింప చేసారు. కాలాతీతం అయిపోతుందని అన్ని సమాజాల సభ్యులు వీరికి ఘనంగా సన్మానించారు.

మినిష్టర్‌గారికి ఇంకొక ప్రోగ్రామ్ వుండటం వలన, పార్లమెంటు సభ్యులు వెంటనే బయలుదేరి ఢిల్లీ వెళ్ళవలసిన అవసరం వుండటం వలన సభ త్వరగా ముగించే ఉద్దేశ్యంతో సన్మానితులని వారి సందేశాన్ని క్లుప్తంగా చెప్పవలసిందిగా కార్యకర్తలు ప్రార్థించారు.

"చాలా బాగుంది" ఇది చంద్రశేఖరంగారి సందేశం.

"ఎందుకు అనవసరంగా ఇంత ఖర్చు?" ఇది పార్వతమ్మగారి మాట.

సభ దిగ్విజయంగా సమాప్తి అయింది.

ఇంటి దగ్గర పార్వతమ్మగారిని వాళ్ళ మనుమరాలు అనన్య యక్షప్రశ్న అడిగింది.

"నువ్వు తాతయ్య మాట్లాడుకోరట. కారణం ఏమిటి?"

పార్వతమ్మగారికి సంతోషం, సిగ్గు ఒక్కసారే కలిగాయి. గతంలోకి చూస్తూ సమాధానం చెప్పింది.

"ఆలుమగల మధ్య మనస్సులు కలిసే దాకానే మాటలు. మనస్సులు కలిసిన తరువాత మాటలతో పనిలేదు."

మంత్రిగారు యింటికి చేరగానే సెక్రటరీని ప్రశ్నించారు. "దేనిని గురించి యీ రోజు యీ వుత్సవం జరిగింది? నేను సరిగ్గానే మాట్లాడాను కదా!"

సెక్రటరీ ఆయన వంక ఆశ్చర్యంగా చూస్తూ సమాధానం చెప్పారు.

"మీరు చాలా బాగా సమయోచితంగా మాట్లాడారు. ఈనాడు చంద్రశేఖరం గారికి డెబ్బైఅయిదు సంవత్సరాలు నిండాయి. ఆయన వివాహం జరిగి యీనాటికి అరవై సంవత్సరాలు నిండాయి. అదే యీనాడు మనం అంతా పాల్గొన్న ఉత్సవానికి కారణం."